క్లుప్తంగా

ఘనంగా పోచమ్మ బోనాలు



ఎల్కతుర్తి : శ్రావణ శుక్రవారం సందర్భంగా గొల్లకురుమస్తు కులస్తులు మండల కేంద్రంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు డప్పుచప్పుళ్ల నడుమ తలపై బోనాలతో ఆలయానికి చేరుకున్నారు. శివసత్తులు తలపై బోనాలతో నృత్యాలు చేశారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి పోచమ్మతల్లికి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కులపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కమలాపూర్ : మండలంలోని గుండేడు ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడి, గోపిక వేషధారణతో కోలాటమాడుతూ నృత్యాలు చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉట్లు కొట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ చికిలె లక్ష్మణ్‌రావు, జెడ్పీటీసీ లాండిగె కలాణి లక్ష్మణ్‌రావు, ఎంఈఓ రాంకిషన్‌రాజు, హెచ్ఎం జి.సత్యం, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ కోసం 'మొలుగూరి' దరఖాస్తు



పరకాల : పరకాల నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికల టికెట్ తనకు ఇవ్వాలని కోరుతూ బీజేపీకి మాజీ ఎమ్మెల్యే, పార్టీ నేత మొలుగూరి బిక్షపతి శుక్రవారం దరకాస్తు చేశారు. ఈ విషయం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. 1995లో పరకాల సర్పంచ్‌గా గెలుపొందిన ఆయన అనంతరం జెడ్పీ వైస్ చైర్మన్‌గా పని చేశారు. అలాగే 2012లో తెలంగాణ ఉద్యమ సమయంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి కొండా సురేఖపై విజయం సాధించారు. కాగా ఐదేళ్ల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన మళ్లీ తాజాగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం గమనార్హం. ఆయన ఆర్నెళ్ల క్రితం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిన విషయం తెలిసిందే.

మురళీధరన్, ఠాక్రేలను కలిసిన 'ఇనగాల'



ఠాక్రేతో మాట్లాడుతున్న వెంకట్రామ్‌రెడ్డి

ఆత్మకూరు : కాంగ్రెస్ పార్టీ స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్, తెలంగాణ ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేలను హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా మీడియాకు వివరాలు వెల్లడించారు. నియోజకవర్గంలోని పరిస్థితులు, తనకున్న అనుబంధం, తదితరాలను వివరించినట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



నరేష్ (ఫైల్)

నడికూడ : ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రాయపర్తిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై రమేష్ కథనం ప్రకారం.. రాయపర్తికి చెందిన చెందిన కోడెపాక నరేష్ (32) కొద్ది రోజులుగా మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతిడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి ..

ఖిలా వరంగల్ : ఎల్కతుర్తి మండలంలోని కేశవాపూర్‌కు చెందిన మధు (50) ఈనెల 7 పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా ఎంజీఎంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు.

ఆరు మేకలు చోరీ

శాయంపేట : మండలంలోన పత్తిపాకకు చెందిన చల్ల రాజయ్య పెంచుకుంటున్న ఆరు మేకలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

పోషకాహారంతోనే ఆరోగ్య పరిరక్షణ



కమలాపూర్ : భీంపల్లిలో గ్రామస్తులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

శాయంపేట : పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ భాగ్యలక్ష్మీ స్పష్టం చేశారు. జాతీయ పోషణ మాసం సందర్భంగా శాయంపేట, పత్తిపాక సెక్టర్ల సూపర్‌వైజర్ల అధ్యక్షతన మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి సీడీపీఓ భాగ్యలక్ష్మీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, తల్లులు ఆహారంలో ఆకుకూరలతోపాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం పోషణ మాసం విశిష్టతను తెలిపేలా మండల కేంద్రంలో అంగన్‌వాడి టీచర్లు ర్యాలీ నిర్వహించారు. అలాగే సూర్యానాయక్ తండాలో అంగన్‌వాడీ టీచర్లు రజిత, స్వాతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సునీత, మంజుల, పోషణ అభియాన్ భిక్షపతి, జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా మిషన్ కోఆర్డినేటర్ కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండల కేంద్రంతోపాటు ముల్కనూర్‌లో పోషణ అభియాన్ మాసోత్సవాలను సీడీపీఓ స్వరూప ప్రారంభించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ స్వరూప మాట్లాడారు. శిశువుకు పుట్టినప్పటి నుంచి ఆర్నెళ్లపాటు కేవలం తల్లి పాలు మాత్రమే తాగించాలని తెలిపారు. మునిగాకు, పాలకూర, తదితర అన్ని రకాల ఆకు కూరలను ఆహారంలో తీసుకుంటే మేలని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, సర్పంచ్‌లు సాతూరి స్వాతి, మాడుగుల కొమురయ్య, ఎంపీటీసీలు బొల్లంపల్లి రమేష్, అప్పని పద్మ, సాతూరి రమ, తదితరులు పాల్గొన్నారు.

దామెర : మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ మంజుల విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ భాగ్యలక్ష్మీ, సూపర్‌వైజర్లు పద్మావతి, జంగం రాణి, అంగన్‌వాడీ టీచర్లు లీలావతి, శోభారాణి, శ్యామల, వాణి, కోమల, తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్ : మండలంలోని ధర్మపురంలో ర్యాలీ నిర్వహించగా సర్పంచ్ మునిగాల యాకూబ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొత్తపల్లి అశోక్, అంగన్‌వాడీ టీచర్లు రుద్ర, సుశీల, మార్త, తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : మండలంలోని భీంపల్లిలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జవ్వాజి పద్మ కుమారస్వామి, అంగన్‌వాడీ టీచర్లు వరలక్ష్మీ, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు : మండలంలోని ఉడుతగూడెంలో అంగన్‌వాడీ టీచర్ ప్రణీత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం చుంచుకాల లింగారావు మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బరిగెల ఆరోగ్యం, రాధిక, రాజు,రవి, వంశీ, రాకేష్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరిక

● ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్



బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

ఎల్కతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆకర్షితులై పలువురు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ తెలిపారు. మండలంలోని దామెర, గోపాల్‌పూర్, దండేపల్లి, జగన్నాథ్‌పూర్ గ్రామాలకు చెందిన సుమారు 100 మంది యువకులకు ఆయన తన నివాసంలో కండువా కప్పి పార్టీలోకి శుక్రవారం ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మయ్య, నాయకులు గొడిశాల వినయ్, శ్రీనివాస్, పిట్టల మహేందర్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో పూజలు

భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలోని వీరభద్రస్వామి ఆలయంలో ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని శ్రీ శివ ఆంజనేయ నవగ్రహ సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ట, పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి, ఎంపీపీ జక్కుల అనిత రమేష్, జెడ్పీటీసీ వంగ రవీందర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మారుపాటి మహేందర్‌రెడ్డి, సర్పంచ్ దూడల ప్రమీల, యాటపోలు రాజమణి, ఆలయ సీఈఓ కిషన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రాధాన్యం

● పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

దామెర : ఆలయాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని శివాలయం అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆ ఆలయ పునర్నిర్మాణ పనులను శుక్రవారం ఆయన సందర్శించి పరిశీలించారు. టెంకాయ కొట్టి పనులను ప్రారంభించి మాట్లాడారు. త్వరగా పనులు పూర్తి కావాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణం, అభివృద్ధికి తన వంతుగా తోడ్పాటు అందిస్తానని చెప్పారు. ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ బిల్లా రమణారెడ్డి మాట్లాడుతూ శివరాత్రిలోగా పనులు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శంకర్, దళితబంధు చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, కోఆప్షన్ సభ్యులు పోల్సాని శ్రీనివాస్‌రెడ్డి, హింగె బాబురావు, నాయకులు పోల్సాని రాంరెడ్డి. ఇంద్రారెడ్డి, గడ్డం సదానందం, వంగ రవి, మేరుగు సంపత్, మిరియాల రవి, మేరుగు కుమారస్వామి, శ్రీను పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయం



పరకాల : కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

పరకాల : పరకాల నియోజకవర్గ ప్రజల సంక్షేమమే తన ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ పట్టణ, మండల కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తన క్యాంప్ కార్యాలయంలో ఆయన కేక్ కట్ చేసి మాట్లాడారు. పేదల అభివృద్ధికి పాటు పడతానని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని తెలిపారు. తొలుత ఎమ్మెల్యేను శ్రేణులు గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, ఏసీపీ కిషోర్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు మడికొండ శ్రీను, చింతిరెడ్డి మధుసూధన్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండి సారంగపాణి, శ్రీకుంకుమేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు, మాదారం సొసైటీ చైర్మన్ నల్లెల లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గవ్యాప్తంగా..

పరకాల నియోజకవర్గంలోని దామెర, ఆత్మకూరు, నడికూడ, శాయంపేట మండలాల్లో ఎమ్మెల్యే ధర్మారెడ్డి జన్మదిన వేడుకలును బీఆర్ఎస్ శ్రేణులు నిర్వహించారు. కేక్‌లు కట్ చేశారు. ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. ఆలయాల్లో పూజలు నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులకు పండ్లు, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు.

ఫ్లెక్సీల ఏర్పాటుపై వివాదం

నడికూడ : పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి జన్మదినం సందర్భంగా మండలంలోని కౌకొండ గ్రామంలో ఫ్లెక్సీల ఏర్పాటుపై వివాదం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో గ్రామ పంచాయతీ మల్టీ వర్కర్స్ ఫోటోలు ఉండడంతో గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. వాటిని వెంటనే తొలగించాలంటూ నిరసన తెలిపారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ఇరు వర్గాలతో మాట్లాడి సర్దిచెప్పారు.

పరిపూర్ణమైన వ్యక్తిత్వంతోనే జీవితంలో ఉన్నతి



కమలాపూర్ : పరిపూర్ణమైన వ్యక్తిత్వంతోనే జీవితంలో ఉన్నతి సాధించగలరని ప్రముఖ సమాజ సేవకుడు డాక్టర్ వజ్జల ప్రతాప్‌కుమార్ స్పష్టం చేశారు. అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌కు చెందిన జేబీ బిల్డర్స్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయ (కేజీబీవీ)లో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ప్రతాప్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. లైఫ్ కోచ్ తనికెళ్ల రామకృష్ణ మాట్లాడుతూ పరిపూర్ణమైన వ్యక్తిత్వం కలిగి ఉండేలా అలవర్చుకోవాల్సిన గుణాలపై వివరించారు. పల్లెర్ల రాజేశ్వర్‌రావు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రంథాలయానికి ప్రతాప్‌కుమార్ పుస్తకాలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ అర్చన, ఉపాధ్యాయుడు దహగం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంపత్‌కుమార్



ర్యాలీ నిర్వహిస్తున్న సంతోష్‌కుమార్, తదితరులు

పరకాల : కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ తెలిపారు. ఢిల్లీలో చేపట్టిన అమృతవాటిక కోసం పట్టణంలోని అమరవీరుల మైదానం నుంచి ఆయన ఆధ్వర్యంలోని నాయకులు శుక్రవారం మట్టిని సేకరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రజాసంక్షేమానికి, అభివృద్ధికి పాటుపడుతోందని తెలిపారు. తొలుత సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, రాష్ట్ర నాయకులు దేవునూరి మేఘనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి, కౌన్సిలర్ జయంత్‌లాల్, కౌన్సిలర్ కొలనుపాక భద్రయ్య, మాజీ సర్పంచ్ సిరంగి సతీష్‌కుమార్, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి కుక్కల విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్‌ఫాం-65 వార్షికోత్సవం

● ఆకట్టుకుంటున్న స్టార్టప్ ఫెస్టివల్



వార్షికోత్సవంలో యాజమాన్యం, సిబ్బంది

కాజీపేట అర్బన్ : కాజీపేట నిట్ ప్రాంతంలోని ప్లాట్‌ఫాం-65 రెస్టారెంట్ వరంగల్ బ్రాంచ్ ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాట్‌ఫాం-65 యాజమాన్యం మాట్లాడారు. రైలు నేపథ్యంలో రూపొందించిన ప్లాట్‌ఫాం-65 రెస్టారెంట్‌లో టాయ్ ట్రెయిన్‌లు టేబుల్ వద్దకే ఫుడ్ తీసుకొచ్చి అందించడం ద్వారా నగరవాసులను ఆకట్టుకుంటున్నట్లు తెలిపారు. ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా 200 రకాల స్టార్టప్స్‌తో ఫెస్టివల్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. వెజ్ అండ్ నాన్ వెజ్ స్టార్టప్‌లు అందుబాటులో ఉంటాయని వివరించారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు హ్యాపీ అవర్ డిస్కౌంట్లు, కాంప్లిమెంటరీ కేక్‌తో సమావేశాలు నిర్వహించుకునే అవకాశం, ప్రైవేట్ డైనింగ్ రూమ్‌లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ప్లాట్‌ఫాం-65 సీజీఎం శ్రీకాంత్ బండారు, సుధ్గున్ పాథా, దిల్‌సుక్‌నగర్ ఈడీ శ్రీనివాస్, వరంగల్ ఈడీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు చీరల పంపిణీ



పరకాల : హుజురాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు శుక్రవారం చీరెలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ మాట్లాడారు. తన తల్లి జ్ఞాపకార్థం 15 ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించటానికి పుస్తకాలు, పరీక్ష ప్యాడ్‌లు, డిక్షనరీలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎంలు మాధవి, రాజయ్య, మాధవి, శంకర్, నరేందర్, సబిత, సునంద, అరుణ పాల్గొన్నారు.

'సఖి'తో బాధిత మహిళలకు భరోసా



సమావేశంలో మాట్లాడుతున్న వినీల

శాయంపేట : సఖి కేంద్రం సేవలతో బాధిత మహిళలకు భరోసా లభిస్తుందని కేస్ వర్కర్ వినీల తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సఖి వన్ స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో వినీల మాట్లాడారు. యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్ స్టాప్ సెంటర్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమస్యల్లో ఉన్న మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన సఖి కేంద్రం ద్వారా అందుతున్న సేవలపై అవగాహన కల్పించి చైతన్యవంతం చేస్తున్నట్టు చెప్పారు. సఖి సెంటర్ ద్వారా విడాకుల కోసం యత్నించే దంపతులకు కౌన్సిలింగ్ చేసి సరైన దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. వరకట్న, లైంగిక, తదితర వేధింపులకు గురైన మహిళలకు, బాలికలకు రక్షణ కల్పిస్తామన్నారు. బాధిత మహిళలకు ఉచితంగా కౌన్సిలింగ్, న్యాయ, పోలీసు, వైద్య సహాయం అందించడంతోపాటు అవసరమైన వారికి తాత్కలిక వసతి కల్పిస్తున్నట్టు వివరించారు. ఎలాంటి సమస్యలున్నా మహిళలు, బాలికలు, టోల్ ఫ్రీ నంబర్ 181కు లేదా 0870–2452112కు ఫోన్ చేసి సహాయం పొందాలని సూచించారు. సదస్సులో ఐసీడీఎస్ సీడీపీఓ భాగ్యలక్ష్మీ, సూపర్‌వైజర్లు సునీత, మంజుల, డీహెచ్ఈడబ్ల్యూ సభ్యులు కళ్యాణి, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్‌కు డాక్టరేట్.. సన్మానం



సాంబశివయ్యను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, అధ్యాపకులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజనీతి శాస్త్ర లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న మాచర్ల సాంబశివయ్యకు ఉస్మానియా యూనివర్సిటీ ప్రభుత్వ పాలనా శాస్త్రంలో డాక్టరేట్ ప్రకటించిన నేపథ్యంలో కళాశాలలో ఆయన్ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఉస్మానియా వర్సిటీ ప్రభుత్వ పాలనా శాస్త్ర ప్రొఫెసర్ డి.లలిత్‌కుమార్ పర్యవేక్షణలో 'కరప్షన్ అండ్ ఈ–గవర్నెన్స్, ద రోల్ ఆఫ్ ఈ–గవర్నెన్స్ ఇన్ రెడ్యూసింగ్ కరప్షన్ ఇన్ ఇండియా విత్ స్పెషల్ రెఫరెన్స్ టు తెలంగాణ' అంశంపై పరిశోధనా గ్రంథాన్ని సమర్పించినందుకు గాను సాంబశివయ్యకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకుడు సాంబశివయ్యను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ డి.సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో అభినందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కవిత, రాజ్‌కుమార్, సురేష్‌బాబు, రామదాసు, కుమరస్వామి, శోభాదేవి, శ్రీనివాస్, సంధ్యారాణి, సిబ్బంది కొండయ్య, కరుణ, శ్రీనివాస్, రమేష్, శ్వేత పాల్గొన్నారు.

యాదవ సామాజికవర్గానికి చైర్మన్ పదవి ఇవ్వాలి

ఐనవోలు : గతంలో ఇచ్చిన హామీ మేరకు ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయ చైర్మన్‌గా ఈసారి యాదవ సామాజికవర్గానికి చెందిన నాయకుడికి అవకాశం ఇవ్వాలని కోరుతూ వరంగల్‌లోని ఎండోమెంట్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ రామాల సునీతకు అఖిల భారత యాదవ సంఘం మండల అధ్యక్షుడు రాజారాపు రాజుయాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. యాదవులను విస్మరిస్తే నష్టపోక తప్పదన్నారు.

ఉపాధి పెంపునకు కృషి

పరకాల : మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కృషి చేస్తోందని కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ తెలిపారు. ఆ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్, కుట్టు శిక్షణ పొందిన మహిళలకు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడారు. సంస్థ ఆధ్వర్యంలో 4 వేల మందికి వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి శిక్షణను వినియోగించుకుని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాలు స్థానికంగా లేక ఇబ్బంది



ఖాళీ కుర్చీకి వినతిపత్రం ఇస్తున్న మహేందర్, తదితరులు

ఐనవోలు : ఎంపీడీఓ, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో లేకపోవడంతో మండల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ ప్రజలకు అందుబాటులో ఉండకుండా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. పలు సమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకు ఆయన ఆధ్వర్యంలోని బృందం మండల పరిషత్ కార్యాలయానికి రాగా ఎంపీడీఓ అందుబాటులో లేకపోవడంతో ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. అనంతరం మహేందర్ మీడియాతో మాట్లాడారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎప్పుడు వచ్చినా కార్యాలయంలో ఎంపీడీఓ అందుబాటులో ఉండడం లేదన్నారు. ఫీల్డ్ విజిటల్‌లో ఉన్నానంటూ సాకులు చెబుతూ ప్రజలను, ప్రజాప్రతినిధులను నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. ఫోన్ చేస్తే స్పందించడం లేదని చెప్పారు. మండల కేంద్రంలోని గురుకుల హాస్టల్‌లో తహసీల్దార్ కార్యాలయం, మల్లికార్జున స్వామి ఆలయ సత్రంలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఎంపీడీఓ కార్యాలయాన్ని హనుమకొండలో ఏర్పాటు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వ కార్యాలయాలన్నీ మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీనాయకులు కొత్తూరు సునీల్, తాళ్లపెల్లి వెంకటరమణ, బరిగెల భాస్కర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



శాయంపేట : వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు



కమలాపూర్‌లో..

శాయంపేట : శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ శివ మార్కండేయ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మార్త రాజ్‌కుమార్ వేదమంత్రోచ్చారణల నడుమ వ్రతాలను కనుల పండువగా చేపట్టారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

కమలాపూర్ : మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన పలువురు మహిళలు పాల్గొని అత్యంత భక్తి ప్రపత్తులతోపూజలు చేశారు. అర్చకుల వేద మంత్రోచ్చారణల నడుమ వ్రతాలు కొనసాగాయి. కార్యక్రమంలో సరస్వతీ శిశుమందిర్ ప్రధానాచార్యులు గుడికందుల స్వరూపరాణి, ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌ను మండలం చేయాలి



ఉప్పల్ జీపీ కార్యాలయంలో సమావేశమైన సర్పంచ్, వార్డు సభ్యులు

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ జీపీ కార్యాలయంలో సర్పంచ్ ఎర్రబెల్లి దేవేందర్‌రావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఉప్పల్‌తోపాటు ఉప్పులపల్లి, భీంపల్లి, కన్నూరు, కొత్తపల్లి, గుండేడు, దేశరాజుపల్లి, కానిపర్తి, శంభునిపల్లి, గుంటూరుపల్లి, ధర్మరాజుపల్లి గ్రామాలను కలుపుతూ ఉప్పల్‌ను మండలం చేయాలని తీర్మానించారు. ఈ మేరకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు సభలు నిర్వహించి తీర్మానం చేసి వాటి ప్రతులను ఉప్పల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందజేయాలని సర్పంచ్, వార్డు సభ్యులు కోరారు.